క్లుప్తంగా

కేంద్ర పథకాలపై అవగాహన



గ్రామస్తులకు వివరిస్తున్న ప్రతినిధులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై వివరించారు. కార్యక్రమంలో నాగేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మందులు పరిశీలిస్తున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఆగ్రోస్ సేవా కేంద్రంలో విక్రయిస్తున్న విత్తనాలు, సీడ్స్‌ను పరిశీలించారు. కాలం చెల్లిన మందులను విక్రయించొద్దని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకొని భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. ఎఎస్ఐ రాజు, నిర్వాహకులు నరేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు దిశానిర్దేశం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రంజన్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): పైచదువులకు ఎలా వెళ్లాలి.. ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోవాలి.. కెరీర్‌ను ఎలా ప్లాన్ చేసుకోవాలని వాటిపై పదవ తరగతి పాసైన విద్యార్థులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్‌రంజన్‌గౌడ్ గురువారం దిశానిర్దేశం చేశారు. మండలంలోని కూచారం ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎలాంటి కోర్సులు తీసుకోవాలి.. పలు అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. హెచ్ సవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలి



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మేట్లు

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధిహామీ పనుల్లో మేట్లుగా పని చేస్తున్న తమను ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని మేట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. మూడు సంవత్సరాలుగా మేట్లుగా పని చేస్తున్న మమ్మల్ని ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని 8 మంది కోరారు. వీరిలో రామకృష్ణ, భిక్షపతి, ప్రవీణ్, నాగమణి, శివశంకర్, రాజేశ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సీలింగాపూర్ గ్రామంలో పెద్దమ్మ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా గురువారం ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో గురువారం రాత్రి కారు ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని యువకుడిని కారు ఢీకొనగా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నరేష్ వెంటనే అతడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా బాధితుడు బీహార్ అయి ఉంటాడని ఎస్సై తెలిపారు.

నిరుపయోగం.. నిఘా నేత్రం

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- మరమ్మతులు శూన్యం..

రూ. లక్షలు వృథా

కొల్చారం(నర్సాపూర్): నేరాల అదుపులో ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. దొంగతనాలు, హత్యలు వంటి సంఘటనలు జరిగిన క్రమంలో నేరస్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అదే లక్ష్యంతో మండలంలోని పలు గ్రామాల్లో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, ప్రస్తుతం మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి.

36 సీసీ కెమెరాల ఏర్పాటు

మండలంలోని రంగంపేటలో దాతల సహకారంతో సుమారు రూ. 10 లక్షలు వెచ్చించి ప్రధాన కూడళ్లను కలుపుతూ గ్రామం చుట్టూ మొత్తం 36 సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు సమర్థవంతంగా పనిచేసిన సీసీ కెమెరాలకు మరమ్మతులు రావడంతో మరోసారి పంచాయతీ ద్వారా ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత పనిచేయకపోవడంతో పాటు వాటి నిర్వహణకు అధికారులు సైతం చర్యలు తీసుకోలేదు. దీంతో చాలా చోట్ల కేబుల్ వైర్లు తెగిపోయి, కెమెరాలు ఊడిపోయాయి. హార్డ్‌డిస్క్ సైతం కనిపించకుండా పోయింది. అలాగే పైతర గ్రామంలో 2020 చివర్లో గ్రామస్తులు తమ సొంత నిధులను సమకూర్చుకొని రూ. 5.50 లక్షలతో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేసే క్రమంలో కొందరు వ్యక్తులు వాటిని ధ్వంసం చేసి కెమెరాలను ఎత్తుకుపోవడం, ఉన్నవి పనిచేయకుండా చేశారు. దీంతో గ్రామంలో సీసీ కెమెరాల నిఘా లేకుండా పోయింది. అప్పట్లో గ్రామంలో జరిగిన దంపతుల హత్య కేసులో సీసీ కెమెరాలు పనిచేయలేదు. దీంతో పోలీసులు కేసును ఛేదించడానికి నెల రోజుల కుపైగా సమయం పట్టింది. హత్యతో సంబంధం లేని వారిని సైతం విచారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీసీ కెమెరాలు పనిచేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని అప్పట్లో గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు దాతల సహకారం తీసుకొని మరిన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



రంగంపేటలో నిరుపయోగంగా సీసీ కెమెరాలు



స్క్రీన్ పై కనిపించని నిఘా



పైతరలో కనిపించని సీసీ కెమెరాలు

సర్వీస్ రోడ్డు మూసి వేయొద్దని ధర్నా



సర్వీస్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న గుల్పర్తి గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని రహదారిపై ఆధ్యా హోటల్ వద్ద సర్వీస్ రోడ్డును మూసి వేయొద్దని డిమాండ్ చేస్తూ గుల్పర్తి గ్రామస్తులు రోడ్డుపై ధర్నా చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ సర్వీస్‌రోడ్డును మూసి వేయడానికి సామగ్రితో రాగా, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ భూములు జాతీయ రహదారి అవతల ఉన్నాయని, సర్వీస్ రోడ్డు మూసివేస్తే ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. అన్ని గ్రామాలవద్ద ఆర్వోబీలు నిర్మిస్తున్న అధికారులు ఇక్కడ ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయమై పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ కౌన్సిలర్ నాగరాజు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దృష్టికి తీసుకెళ్లారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: నిరుపేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొల్చారం మండలం పాతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బుట్ట వినోద శస్త్ర చికిత్స నిమిత్తం రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ మంజూరు అయింది. వాటి ఎల్‌ఓసీ పత్రాన్ని వినోద కుటుంబ సభ్యులకు సునీతారెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవితేజరెడ్డి, సమీర్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని, ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన, ఎస్ఐ నర్సింహులుతో కలిసి మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత రశీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్ ఉన్నారు.



రైతుసేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ, ఎస్ఐలు

సాగు పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని అవంచ, బ్రాహ్మణపల్లి, ఖాజీపేట గ్రామాల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగులో మెలకువలు వివరించారు. పచ్చి రొట్ట ఎరువుల వాడకం, సస్యరక్షణ, రసాయనవీరుల వాడకంతో జరిగే నష్టంపై వివరించారు. అనంతరం రైతుల సందేహాలను అడిగి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శాంతి, డాక్టర్ రవీందర్ నాయక్, డాక్టర్ అమీర్‌పాషా, డాక్టర్ సుశీల, డాక్టర్ రాధిక, ఏఈ ఓలు రవివర్మ, దుర్గాప్రసాద్, లక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ షాకీర్ అలీ, వైద్యాధికారి షరీఫొద్దీన్ సూచించారు. పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఇతరశాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ట్యాంకుల క్లీనింగ్, మురుగు కాల్వల పరిశుభ్రత, క్లోరినేషన్, గుంతలల్లో నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. అలాగే దోమలు విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాలలో డ్రైడే, ఫ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది యాదయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఈఓ సన్మానం

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పది ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం పాలిటెక్నిక్, ఇతర కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యకుమార్, ఉపాధ్యాయులు దయానంద్, రవి, గోపి, ప్రసన్నకుమార్, జూనియర్ కళాశాల నోడల్ అధికారి అనంత రాజశర్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టీసీలు అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశం

నాణ్యమైన విత్తనంతోనే మంచి దిగుబడి

చిన్నశంకరంపేట(మెదక్): వరి పంట సాగులో రైతులు అధిక దిగుబడిని అందించే నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్ సూచించారు. నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండాలో గురువారం వానకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసన్న హోలజర్, డాక్టర్ పాపరావులతో కలిసి రైతులకు విత్తన ఎంపిక నుంచి వరిసాగు వరకు అనుసరించాల్సిన పద్ధతులపై మెళకువలు నేర్పించారు. రసాయనాలను తగ్గించి జీవన, సేంద్రియ ఎరువులనే వాడాలని సూచించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వీధుల్లో విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయంవద్ద భక్తులకు అన్నదానం చేశారు.



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆలయ వ్యవస్థాపకుడు వల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు నాగేష్, పట్టణ కార్యదర్శి రామ్‌రెడ్డి, ఎస్టీ సెల్ నాయకుడు రాములు నాయక్, అరవింద్ గౌడ్, పురోహితులు హరిప్రసాద్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

నర్సాపూర్ : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ డిమాండ్ చేశారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వీఓగా పని చేసిన తమ సామాజిక వర్గానికి చెందిన శైలజను ఆమె భర్త మహేశ్‌ను అదే గ్రామానికి చెందిన కమ్మరి వంశీ, వివేక్‌చారి ఈనెల 15న కులం పేరుతో తిట్టి కొట్టారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వారి వడ్లు తూకం వేసేందుకు సీరియల్ రాలేదని చెప్పినా వినకుండా కొట్టారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాల మహానాడు ఆనంద్‌కుమార్, భిక్షపతి, శివ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన తూప్రాన్- నర్సాపూర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ శివ్వంపేట నుంచి నర్సాపూర్ వైపునకు బైక్‌పై వెళ్తుండగా చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వంశీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో వర్షాకాలం మరమ్మతుల కారణంగా చేగుంట, బోనాల్ అనంతసాగర్, కర్నాల్‌పల్లి, చందాయిపేట, గొల్లపల్లి, కసాన్‌పల్లి గ్రామాల్లో నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలే

నర్సాపూర్ రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరించారు. నర్సాపూర్ పట్టణంలోని విత్తనాలు, ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం టాస్క్‌ఫోర్స్ బృందంతో పాటు వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. విత్తనాలు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించి, ప్రతీరోజు జాబితా రికార్డుల్లో ఎక్కించాలని సూచించారు.

సర్దనలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన ఆయుర్వేద వైద్యశాలలో గురువారం అంతర్జాతీయ యోగ దినోత్సవం దశాబ్ది వేడుకల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్దన ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజితారెడ్డి, డాక్టర్ మధుమిత, ఫార్మాసిస్టు మహ్మద్ యూసుఫ్‌లు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న కేవీకె శాస్త్రవేత్త

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో రైతు వేదికలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ ఎఫ్‌పీఓ చైర్మన్ లక్ష్మాగౌడ్ అధ్యక్షతన వికాసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీఆర్ఆర్ శాస్త్రవేత్తలు చిన్న బాబు నాయక్, డా.శ్రీకాంత్, డా.జాన్ దాస్ హాజరై మాట్లాడారు. వరి పంటలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. వరిలో చేపట్టబోయే యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతాంగానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఏఈఓ శ్రీలత, సీఈఓ సురేష్, లింగం గౌడ్, లింగం, వెంకట్, రాజు, ఎల్లారెడ్డి, ఎల్లయ్య, నారాయణ, బాలయ్య పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు

శివ్వంపే(నర్సాపూర్): రెండు రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అసైన్డ్ భూముల్లో నుంచి అక్రమార్కులు రాత్రి వేళల్లో మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధి శభాష్‌పల్లి గ్రామశివారులోని అసైన్డ్ భూమి సర్వే నంబర్ 63లో నుంచి రాత్రి వేళల్లో జేసీబీలతో మట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. శభాష్‌పల్లి గ్రామం శివ్వంపేట మండల శివారు ప్రాంతం కావడంతో రాత్రి సమయంలో ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున తూప్రాన్ మండలంలోని పలు చోట్లకు మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరి వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కమలాద్రి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



శభాష్‌పల్లిలో అసైన్డ్ భూముల్లో తవ్వకాలు

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పాపన్నపేట(మెదక్): పది పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో తమకు ఇష్టమైన కోర్సులోనే చేరాలని నాగ్సాన్‌పల్లి ప్రధానోపాధ్యాయుడు రాంకిషన్ పిలుపు నిచ్చారు. పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాపన్నపేట జూనియర్ కళాశాల లెక్చరర్లు రమేశ్, ప్రవీణ్ కుమార్ పలు కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామర్థ్యాలు, లక్ష్యాల కనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు నజీరొద్దీన్, అశోక్ కుమార్, పదో తరగతి విద్యార్థులు, వారి పోషకులు పాల్గొన్నారు. విద్యార్థులకు టీసీలు, బోనాఫైడ్‌లు ఇచ్చారు.

చిన్నారులకు యోగాలో శిక్షణ

రామాయంపేట(మెదక్): ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో చిన్నారులకు యోగా ట్రైనర్ మద్దెల భరత్ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం, ప్రాణాయామం, ఆసనాలు వేయడంలో శిక్షణనిచ్చారు.



ఆసనాలు వేస్తున్న చిన్నారులు

నాణ్యమైన ఇసుకనే వినియోగించాలి

అసిస్టెంట్ జియోలజిస్ట్ మధుకుమార్



అజ్జమర్రిలో శివారులోని మంజీరాలో ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నాణ్యమైన ఇసుకనే వినియోగించాలని అసిస్టెంట్ జియాలజిస్ట్ మధుకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్మాణాలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని అజ్జమర్రి, బండపోతుగల్ గ్రామ శివారులో గల మంజీరా వాగులో ఉన్న ఇసుకను పరిశీలించి, నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము పరిశీలించిన ఇసుక గృహ నిర్మాణాలకు అనువైనదిగా లేదన్నారు. మండల పరిధిలోని గంగారం, చండూర్ శివారులో గల మంజీరాలో సైతం ఇసుకను పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో భుగర్భజల శాస్త్రవేత్త లావణ్య, ఇరిగేషన్ ఏఈ హరీష్‌రెడ్డి, ఆర్ఐ సునీల్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి పాల్గొన్నారు.